సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 16 । మే । 2025



న్యూస్‌రీల్

జూలై 5న జాతీయ లోక్ అదాలత్


జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. ఈనెల 10న జరగాల్సిన ఈ అదాలత్ వివిధ కారణాల వల్ల వాయిదా పడింది. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నిరాధరణకు గురైన చెక్కులు కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశాఖలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్‌లో లేదా 0891-2560414, 2575046 ఫోన్ నెంబర్లలో, మండల న్యాయ సేవా సంఘాల్లో సంప్రదించాలన్నారు.

జిల్లాలో 10 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: గ్రీన్ విశాఖ మిషన్‌లో భాగంగా జిల్లాలో పది లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ తెలిపారు. గురువారం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వీఎంఆర్‌డీఏ ద్వారా లక్ష మొక్కలు, జీవీఎంసీ 2.50 లక్షలు, అటవీ శాఖ 84 వేలు, డూమా 60 వేలు, పరిశ్రమల శాఖ 50 వేలు, విశాఖ పోర్టు 25 వేలు, విద్యాశాఖ 12 వేలు, ఇతర శాఖల ద్వారా 4.28 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 6 నుంచి వివిధ దశల్లో ఈ మొక్కల్ని నాటేలా ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డూమా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, డీఎఫ్‌వో మంగమ్మ, జీవీఎంసి హార్టికల్చర్ డీడీ దామోదర్, వీఎంఆర్‌డీఏ డీఎఫ్‌వో శివాని, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, పోర్టు హార్టికల్చర్ అధికారి రాధిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌సీఎస్‌సీలో జాబ్‌మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 100 ఖాళీల భర్తీకి స్థానిక నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్‌సీ)లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ అడ్మిన్, టెలీకాలర్స్, నర్సింగ్, సేల్స్ మేనేజర్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణత సాధించిన 18-35 ఏళ్ల మధ్య వయసున్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో ఎన్‌సీఎస్‌సీకి హాజరు కావాల్సిందిగా సూచించారు.

రాష్ట్ర, జాతీయ క్రెడాయ్ కమిటీల్లో విశాఖకు పెద్దపీట

విశాఖ సిటీ: విశాఖకు చెందిన పలువురు ప్రముఖులు రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంఘాల సమాఖ్య(క్రెడాయ్)లో రాష్ట్ర, జాతీయ స్థాయి కీలక పదవులకు ఎంపికయ్యారు. ఈ నియామకాలతో విశాఖ ఖ్యాతి జాతీయ స్థాయిలో మరింత పెరిగిందని క్రెడాయ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. రాష్ట్ర అధ్యక్షుడిగా బయన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా కె.ఎస్.ఆర్.కె.రాజు బాధ్యతలు స్వీకరించారు. మరో కార్యక్రమంలో.. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్ సమక్షంలో క్రెడాయ్ జాతీయ స్థాయి పదవుల్లోనూ విశాఖ ప్రతినిధులు స్థానం సంపాదించారు. నేషనల్ ఎమర్జింగ్ సిటీస్ కన్వీనర్‌గా బొప్పన రాజా శ్రీనివాస్, సివిల్ ఏవియేషన్ కో-కన్వీనర్‌గా అశోక్‌కుమార్ ఎరడాల, క్రెడాయ్ యూత్ వింగ్ (సౌత్) జాయింట్ సెక్రటరీగా గొంప కార్తీక్ నియమితులయ్యారు.

కూటమి మాస్టర్ ప్లాన్

వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన షురూ..

- ఈ నెల 22 నుంచి జూన్ 21 వరకు మళ్లీ అభ్యంతరాల స్వీకరణ
- ఇందులో ప్రజాప్రతినిధుల ప్రయోజనాలకు పెద్దపీట
- వారి స్థిరాస్తి వ్యాపారాలకు అనుగుణంగా సవరణలకు ప్లాన్
- నేతలు చెప్పినట్లే మార్పులు చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు?



విశాఖ సిటీ: కూటమి 'మాస్టర్' ప్లాన్ వేస్తోంది. తమ వారికి లబ్ధి చేకూరేలా బృహత్తర ప్రణాళికలో సవరణలకు సిద్ధమైంది. ప్రజాప్రతినిధుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసేందుకు అడుగులు వేస్తోంది. చెల్లికి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ.. అన్నట్లు.. 2021లో పూర్తయిన విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన చేపట్టాలని నిర్ణయించింది. గతంలో అశాస్త్రీయంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారన్న నెపంతో అయిపోయిన పెళ్లికి మళ్లీ బాజాలు వాయించడానికి పూనుకుంది. కేవలం కూటమి నేతల స్థిరాస్తి వ్యాపారాలకు మేలు జరిగేలా మార్పులు, చేర్పులకు ఈ నెల 22 నుంచి మళ్లీ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ ప్రారంభించనుంది.

2021లోనే మాస్టర్ ప్లాన్ పూర్తి

వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బృహత్తర ప్రణాళిక-2041కు ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి 2011లో ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఏళ్లు గడిచినా అది పూర్తి కాకపోవడంతో 2016లో ప్రైవేట్ కన్సల్టెంట్ సంస్థ లీ అసోసియేట్స్‌కు రూ.10 కోట్లకు ఆ బాధ్యతను అప్పగించారు. అయినప్పటికీ 2019కి కూడా అది పూర్తి కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాస్టర్‌ప్లాన్‌పై దృష్టి సారించింది. మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమయంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో 46 మండలాలు, 1,312 గ్రామాలున్నాయి. ప్రణాళికను రూపొందించేందుకు విశాఖపట్నంలోని 5 వర్గాలు, 45 రెవెన్యూ, 55 మత్స్యకార గ్రామాలు, 13 వార్డులను పరిగణనలోకి తీసుకొని.. సలహాలు, సూచనలు ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా వివరాలు సేకరించారు. అలాగే విజయనగరం జిల్లాలోని 48 రెవెన్యూ, 19 మత్స్యకార గ్రామాలు, 5 వార్డులు, రెండు వర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందుకోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ, అభ్యంతరాల స్వీకరణలో మొత్తంగా 17,460 అభ్యంతరాలు, సలహాలు వచ్చాయి. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, ఇతర సంబంధిత విభాగాల అధికారులతో సంయుక్త తనిఖీలు, సందర్శనలు నిర్వహించి వాటిన్నింటినీ పరిశీలించారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. ఆ ప్రాంత భౌగోళిక స్థితిగతులను అనుసరించి విభిన్న కోణాల్లో ఆలోచన చేసి ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. దానికి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో 2021 నవంబర్ 8న వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041కు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

ప్రజాప్రతినిధులకు లబ్ధి చేకూరేలా?

ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులకు లబ్ధి చేకూర్చాలన్న ఆలోచనతోనే వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునః పరిశీలనకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాల పేరుతో కూటమి నాయకులు సూచించిన మార్పులు, చేర్పులకే పెద్ద పీట వేయాలన్న నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వారు సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు సమాచారం. వీరి స్థిరాస్తి వ్యాపారాలు, వ్యక్తిగత ఆస్తుల విలువ పెంచుకునేందుకు మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రణాళికలను మార్పులు చేసుకోవడానికి సిద్ధమవుతున్నట్లు కూటమిలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా మధురవాడ నుంచి ఆనందపురం మధ్యలోను, అలాగే అనకాపల్లిలో పలు చోట్ల మార్పులు, చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే మాస్టర్ ప్లాన్ మొత్తంగా మార్పు చేసే అవకాశం లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు. కేవలం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి శాస్త్రీయంగా ఉన్న వాటిని మాత్రమే మార్పులు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

మళ్లీ అభ్యంతరాల స్వీకరణ

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌పై ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు ఆరోపణలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్లాన్‌లో మార్పులు చేస్తామని అప్పుడే ప్రకటించారు. అన్నట్లుగానే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాస్టర్ ప్లాన్-2041ను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించింది. నాలుగు నెలల్లో కొత్త మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామని అమాత్యులు సైతం ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే బృహత్తర ప్రణాళికను పునః పరిశీలనకు తేదీని ఖరారు చేశారు. ఈ నెల 22 నుంచి జూన్ 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న ప్రజలు, భాగస్వాములు, సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనున్నారు. మాస్టర్ ప్లాన్-2041లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే స్వయంగా గానీ, పోస్టు లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా తెలపవచ్చని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రకటించారు. ప్రజలందరూ మొబైల్ ద్వారా కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమీక్ష


సమీక్షిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇతర అధికారులు

మహారాణిపేట: జూన్ 21న విశాఖ వేదికగా జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగ్ హాల్లో అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. జూన్ 21న ఉదయం 6 నుంచి 8 మధ్య 45 నిమిషాలు పాటు కార్యక్రమం జరగనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో సుమారు 2.5 లక్షల మంది భాగస్వామ్యమయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు ఆర్కే బీచ్ రోడ్ లేదా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ప్రధాన వేడుకల్లో భాగస్వామ్యం అవుతారని, దానికి సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేయాలని నిర్దేశించారు. ప్రత్యామ్నాయ వేదికలుగా ఏయూ కన్వెన్షన్ హాలు, మద్దిలపాలెం కాకతీయ ఫంక్షన్ హాల్ లేదా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలను గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, క్రీడాకారులకు, ప్రధాన వేదికల వద్ద భాగస్వామ్యం అయ్యే వారికి ముందస్తు శిక్షణ అందించాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీ మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఏడీసీపీ రాజ్ కమల్, ప్రత్యేకాధికారులు సత్తిబాబు, సుధాసాగర్, శేషశైలజ, మధుసూదన్ రావు, డీఈవో ప్రేమకుమార్, ఆర్‌ఐవో, ఇతర విభాగాల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యప్రకాష్



సాక్షి, విశాఖపట్నం: ఈపీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాష్ అన్నారు. ఇటీవల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. డిస్కమ్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రాజెక్టుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. 2021లో పదవీ విరమణ చేసినప్పటికీ, ప్రస్తుతం డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టినట్లు సూర్యప్రకాష్ తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టినట్లు వెల్లడించారు. సర్కిళ్ల వారీగా వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సరఫరాలో లోపాలపై నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు చేసి, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాలకు 24 గంటలూ మూడు ఫేజుల విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల తరచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో విద్యుత్ కోటా కంటే డిమాండ్ ఎక్కువగా ఉందని, రోజూ 18 నుంచి 19 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందన్నారు. గాలి, వర్షాల కారణంగా వైర్లు తెగిపడటం, స్తంభాలు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితులు మినహా, మిగతా సమయాల్లో ఈపీడీసీఎల్ పరిధిలో అంతరాయాలు లేకుండా సరఫరా చేస్తున్నట్లు వివరించారు. నైరుతి రుతుపవనాలు త్వరగా ప్రవేశించే అవకాశం ఉన్నందున.. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు ఇప్పటికే ప్రారంభించామన్నారు. ప్రతి లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలను సరిదిద్దుతున్నామని.. వర్షాకాలంలో సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రణాళికలు అమలు చేస్తామని సూర్యప్రకాష్ వివరించారు.

సాక్షి ఇంటర్వ్యూ

ప్రాజెక్టుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి

ఆగస్టు 15 నాటికి రెండో దశ భూగర్భ విద్యుత్ వ్యవస్థ పూర్తి చేస్తాం

ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వనజ



సాక్షి, విశాఖపట్నం: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సేవలందిస్తామని సంస్థ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.వనజ అన్నారు. ఇటీవలే డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె.. డిస్కమ్ పరిధిలోని పలు సర్కిళ్లలో పర్యటించి, ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లోని అన్ని విభాగాల్లో 37 ఏళ్ల పాటు సేవలందించిన అనుభవం తనకుందన్నారు. ప్రస్తుతం ఈపీడీసీఎల్‌లో జరుగుతున్న పనులపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నానని, చేపట్టిన పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. నగర పరిధిలో రెండో దశలో భాగంగా రూ.909 కోట్ల వ్యయంతో 1,876 కిలోమీటర్ల మేర భూగర్భ విద్యుత్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 120 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆర్ఎంఈఎస్, డీటీఆర్స్ మొదలైన వాటిపై కసరత్తు జరుగుతోందని, ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అయితే తవ్వకాల కోసం జీవీఎంసీ నుంచి అనుమతులు, ఫారెస్ట్ క్లియరెన్స్‌ల కారణంగా కొంత జాప్యం జరుగుతోందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విభజన పనులపై సమీక్ష నిర్వహించామని, ఫీడర్ బైఫరకేషన్ పనుల్లో ప్యాకేజీ-1 గత నెలాఖరు చివరి నాటికి 27 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు సర్కిళ్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఇండోర్, అవుట్‌డోర్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉన్నందున.. ముందుగానే పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'పీఎం జుగా'(ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద ఎస్టీ గ్రామాలకు విద్యుత్ వెలుగులు అందించేందుకు కృషి చేస్తున్నామని డైరెక్టర్ వనజ వివరించారు.

రెగ్యులర్ vs ఎయిడెడ్

- ఆంధ్ర యూనివర్సిటీలో ఆధిపత్య పోరు
- ఎయిడెడ్ అధ్యాపకులను వెనక్కి పంపించేయాలని ఓ వర్గం పట్టు
- వైస్ చాన్సలర్ సమీక్షలోనూ ఇదే చర్చ
- పాఠాలు పక్కన పెట్టి.. పెత్తనంపై ఆరాటం
- ఏయూలో అధ్యాపకుల తీరుపై విమర్శలు



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో ఆధిపత్య పోరు మళ్లీ రాజుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వర్సిటీలోని కొంతమంది ఆచార్యులు విద్యార్థులకు పాఠాలు చెప్పడం మానేసి, పాలనలో పెత్తనం కోసం ఆరాటపడుతున్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల నుంచి ఫారిన్ సర్వీసుపై ఏయూకు వచ్చిన అధ్యాపకుల పట్ల వర్సిటీలోని ఓ వర్గం వ్యవహరిస్తున్న తీరు ఇందుకు నిదర్శనం. 1000 మందికి పైగా అధ్యాపకులు ఉండాల్సిన ఏయూలో ప్రస్తుతం 140 మంది మాత్రమే రెగ్యులర్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులతోనే కాలేజీల్లో పాఠాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ సేవలను వినియోగించుకోవాల్సింది పోయి.. తామేదో పరాయి దేశం నుంచి వచ్చినట్లుగా, వెళ్లిపోండంటూ కొంతమంది కావాలని రాద్ధాంతం చేస్తున్నారని ఎయిడెడ్ అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, డీన్లతో మంగళవారం జరిగిన వైస్ చాన్సలర్ సమీక్షలోనూ ఓ వర్గం ఇదే అంశంపై పట్టుబట్టడం.. ఇప్పుడు వర్సిటీలో హాట్ టాపిక్‌గా మారింది.

రెగ్యులర్ అధ్యాపకుల కొరతతో మల్లగుల్లాలు

ఏయూలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 2023 జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ కాలేజీల నుంచి ఫారిన్ సర్వీసు కింద 80 మంది అధ్యాపకులను తీసుకున్నారు. వర్సిటీ పాలక మండలి ఆమోదంతో నిర్ణయం తీసుకున్నందున ఉన్నత విద్యామండలి అధికారులు సైతం ఇందుకు అనుమతించారు. కాగా.. ఎయిడెడ్ అధ్యాపకుల రాకను ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది నచ్చక దాదాపు 40 మంది వెనక్కి వెళ్లిపోయారు. మిగిలిన వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరు ఇటీవలే మాతృ సంస్థకు వెళ్లారు. ప్రస్తుతం 38 మంది ఎయిడెడ్ నుంచి వచ్చిన అధ్యాపకులు పనిచేస్తున్నారు. క్యాంపస్ కాలేజీల్లోని ఆయా విభాగాల్లో తరగతుల నిర్వహణలో వీరంతా కీలకంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఖాళీల భర్తీ ఇప్పట్లో లేనట్లేనా?

రాష్ట్రంలోని ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో టీచింగ్ 10 మంది, నాన్ టీచింగ్ 20 మంది అవసరం ఉందని, ఆన్ డ్యూటీ బేసిస్/ఫారిన్ సర్వీసు కింద పనిచేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని కాలేజీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా ఈ నెల 8న సర్క్యులర్ జారీ చేశారు. ఇది తమకు కొంత ఊరటనిచ్చే విషయమేనని ఏయూలో ఫారిన్ సర్వీసు కింద పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులు అంటున్నారు. అయితే ఆయా యూనివర్సిటీలు 2025-26 విద్యా సంవత్సరానికి తమ అవసరాల మేరకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించడం బట్టి, ఇప్పట్లో ప్రభుత్వం రెగ్యులర్ ఖాళీల భర్తీపై దృష్టి సారించే ఆలోచనలో లేదని అర్థమవుతోంది.


తెరపైకి హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లేఖ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎయిడెడ్ అధ్యాపకులను వెనక్కి పంపించేలా ఓ వర్గం ఒత్తిడిచేస్తూనే ఉంది. కానీ ఫారిన్ సర్వీసుపై వచ్చినందున 2026 జూన్ వరకు వారికి ఇక్కడ పనిచేసే అవకాశం ఉంది. వర్సిటీనే వేతనాలు చెల్లిస్తున్నందున, వారి సేవలను కొనసాగించాలనుకుంటున్నారా? లేదా? అంటూ మార్చిలో హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇక్కడి అధికారులకు లేఖ రాశారు. వందేళ్ల ఉత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో వారి విషయంలో నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం కావాలని వర్సిటీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. ఇదే అదునుగా భావించిన వర్సిటీలోని ఓ వర్గం ఎయిడెడ్ అధ్యాపకులను వెనక్కి పంపించేయాల్సిందేనని ప్రస్తుత వైస్ చాన్సలర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వారి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని సామాజిక మాధ్యమాల వేదికగా నిరసన గళం వినిపిస్తున్నారు.

ఈసెట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

మురళీనగర్: ఇంజినీరింగ్ సెట్(ఈసెట్)లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు సత్తా చాటారు. గురువారం విడుదలైన ఈసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ కాలేజీ నుంచి ఈసెట్ రాసిన విద్యార్థుల్లో మెటలర్జీ విభాగంలో నంబారు అభిషేక్ మొదటి ర్యాంకు సాధించాడు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ నుంచి కె.సత్య కృష్ణ సాయి యోషిక్ 3వ ర్యాంకు, శీరపు మేఘన 4వ ర్యాంకు, వెన్నెల గీతిక 9వ ర్యాంకు సాధించారు. సివిల్ ఇంజినీరింగ్ నుంచి అర్జాల కేశవరావు 11వ ర్యాంకు, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి మొహమ్మద్ హసనుద్దీన్ 9వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింగరావు, మెకానికల్ హెడ్ మధుకుమార్, మెటలర్జీ హెడ్ రత్నకుమార్, సివిల్ హెడ్ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

కెమికల్‌లో మొదటి 10 ర్యాంకులు మనవే.. 8లో





ఆర్ట్ శిక్షణ పొందుతున్న మహిళలు



క్రాఫ్ట్ శిక్షణ పొందుతున్న మహిళలు

నైపుణ్యతకు మెరుగు!

- స్వయం ఉపాధి వైపు అడుగు
- టీటీసీ కోర్సుపై ఆసక్తి చూపుతున్న యువత
- ఆర్ట్, క్రాఫ్ట్ శిక్షణతో ఉద్యోగ అవకాశాలు
- వేసవిలో 42 రోజుల పాటు శిక్షణా తరగతులు



భారత్-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఓ విద్యార్థి గీసిన చిత్రం

విశాఖ విద్య: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తోంది. ఉన్నత విద్యను అభ్యసిస్తూనే.. సత్వర ఉపాధి లక్ష్యంగా నైపుణ్యతతో కూడిన స్వల్పకాలిక టెక్నికల్ కోర్సుల వైపు ఆసక్తి కనబరుస్తోంది. ఇటువంటివారి కోసం విద్యాశాఖ ఏటా వేసవిలో 'టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్'(టీటీసీ) కోర్సులను ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. 42 రోజుల వ్యవధి గల ఈ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 42 ఏళ్ల వరకు వయస్సు గల వారు అర్హులు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ కోర్సులను అభ్యసించేందుకు 180 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం నగరంలోని ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూల్‌లో ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.

ఎన్ఈపీ అమలుతో టీటీసీకి డిమాండ్

విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉండేవి. జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో తప్పనిసరిగా ఆర్ట్, క్రాఫ్ట్ సబ్జెక్టు టీచర్లను నియమించాలనే నిబంధన పెట్టారు. టీటీసీ కోర్సు చేసిన వారు మాత్రమే ఆయా పోస్టులకు అర్హులు కావటంతో డిమాండ్ పెరిగింది. మానసిక, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే అంశాలతో కూడిన సబ్జెక్టులు కావటంతో వచ్చే ఏడాది నుంచి కోర్సు వ్యవధి 42 రోజులకు బదులుగా 6 నెలలు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

ఉత్తమ శిక్షణ

ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన శిక్షణ తరగతులు జూన్ 11వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులను నిర్వహిస్తున్నారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆరుగురు టీచర్లు.. సైకాలజీ, స్కూల్ అడ్మిస్ట్రేషన్ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు మరో ఇద్దరు టీచర్లను నియమించారు. వీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నైపుణ్యతతో కూడిన శిక్షణ అందిస్తున్నారు.



భార్యాభర్తలకు ఒకే డ్రస్‌కోడ్ ఉండేలా సీతారాముల చిత్రాలతో తీర్చిదిద్దిన డ్రస్సులు

ఉపాధి కోసం..



నా డిగ్రీ చదువు అనివార్య కారణాలతో మధ్యలోనే ఆగిపోయింది. నాకు ముగ్గురు పిల్లలు. క్రాఫ్ట్‌లో ఇప్పటికే లోయర్, హయ్యర్ కంప్లీట్ చేశాను. టీటీసీ పూర్తి చేస్తే ప్రైవేటు స్కూళ్లలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నేను నేర్చుకున్న విద్యలో మరింత నైపుణ్యత పొందుతూ.. ఇంటి వద్ద మరి కొంతమందికి శిక్షణ ఇస్తున్నాను.

– కర్రి చంద్రిక, గవరపాలెం, అనకాపల్లి జిల్లా

బొమ్మలు వేయడం ఇష్టం



నేను బీటెక్ కంప్యూటర్ సైన్సు పూర్తి చేశాను. ఎంటెక్‌లో చేరేందుకు ఎంట్రన్స్ రాస్తున్నాను. చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం అంటే ఇష్టం. నాన్న ప్రోత్సాహంతో ఆర్ట్‌లో శిక్షణ పొందుతున్నాను. ఆర్ట్ కోర్సులో లోయర్, హయ్యర్ ఇప్పటికే పూర్తి చేశాను. మరింత నైపుణ్యత పొందేందుకు టీటీసీ శిక్షణ ఉపయోగపడుతుంది.

–ఎం.పీ.శైలజ, సుజాతనగర్, విశాఖ జిల్లా



శిక్షణ భాగంగా వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు



చీరపై వేసిన డిజైన్ చూపిస్తున్న మహిళ

ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నాం..



టీటీసీ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఆర్ట్, క్రాఫ్ట్‌లో నైపుణ్యత గల ఉపాధ్యాయులను శిక్షణ ఇచ్చేందుకు నియమించాం. ప్రాక్టికల్స్‌లో విద్యార్థులంతా భాగస్వామ్యులను చేసి, వారి ఫెర్ఫార్మెన్స్ అంచనా వేయాలని ఆదేశాలు ఇచ్చాం. తరగతులను రోజూ పర్యవేక్షిస్తున్నాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

స్టాఫ్ నర్సుల ఎంపిక జాబితా విడుదల

- 22, 23 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన
- ప్రస్తుతం 124 పోస్టులు మాత్రమే భర్తీ: ఆర్డీ

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియలో భాగంగా గురువారం ఎంపిక జాబితా విడుదలైంది. ఈ నెల 22, 23 తేదీల్లో రేసవానిపాలెంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. రోజుకు 60 మంది చొప్పున రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి తెలిపారు. ఫలితాలను https://cfw.ap.nic.in/, https:// nagendrasvst.wordpress.com/ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. మొత్తం 124 పోస్టులకు గాను 115 మంది అభ్యర్థులతో ఎంపిక జాబితాను విడుదల చేశారు. తొమ్మిది పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద కేటాయించామని, సంబంధిత అధికారుల నుంచి జాబితా అందిన తర్వాత వీటిని భర్తీ చేస్తామని ఆర్డీ తెలిపారు. గత ఆరు నెలలుగా సాగుతున్న ఈ భర్తీ ప్రక్రియలో పోస్టుల సంఖ్యలో మార్పులు అభ్యర్థులను గందరగోళానికి గురి చేశాయి.

తొలుత ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 నర్సు పోస్టులకు దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత మరో 264 పోస్టులు కలవడంతో మొత్తం 370 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల నుంచి మొత్తం 8,309 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా పోస్టుల సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోయింది. మొత్తం 370 పోస్టులకు అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్, ప్రీ ఫైనల్ జాబితాలు విడుదల చేసిన తర్వాత.. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆదేశాల మేరకు 246 పోస్టుల భర్తీని నిలుపుదల చేశారు. దీంతో గురువారం కేవలం 124 నర్సు పోస్టులకు మాత్రమే ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆసుపత్రుల్లో 90 పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 పోస్టులను మాత్రమే ప్రస్తుతం భర్తీ చేస్తున్నట్లు ఆర్డీ వెల్లడించారు.

రాష్ట్రంలో అడ్డగోలు భూ కేటాయింపులు ఆపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు భూ కేటాయింపులు తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ విచ్చేసిన ఆయన గురువారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ విశాఖలో ఉర్సా కంపెనీకి ఎకరా 99 పైసలకు కేటాయించిన సీఎం చంద్రబాబు నాయుడు, ప్రజలంతా వ్యతిరేకిస్తే ఇప్పుడు ఎకరా రూ.1.50 కోట్లని చెప్పడం దారుణమన్నారు. ఎవరీ ఉర్సా? అని అడిగినా ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. విశాఖలో ఐటీ కంపెనీలు రావాలని సీపీఎం కోరుతోందని, అయితే గతంలో అదానీ డేటా సెంటర్‌కు 130 ఎకరాలు కేటాయించినా, ఇంత వరకూ అతీగతీ లేదన్నారు. అమరావతిలో రాజధాని కోసం గతంలో తీసుకున్న వేల ఎకరాలు చాలవా? అని అక్కడి ప్రజలే అడుగుతున్నారని, మరో 44 వేల ఎకరాలు ఇటీవల తీసుకోవడం దేనికని ప్రశ్నించారు. విశాఖ, అమరావతిలో రాజధాని కోసం కేటాయించిన భూములు రియల్ ఎస్టేట్ కోసం తప్ప, ప్రజలకు ఏం మేలు జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక ప్యాకేజీ తర్వాత నిలబడుతుందనుకున్న ప్రజలు, కార్మికుల్లోని ఆశలు నేడు సన్నగిల్లుపోతున్నాయన్నారు. తాజాగా ప్లాంట్‌లో నిర్బంధ చర్యలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 13న లంచ్ సమయంలో ప్లాంట్‌లో మీటింగ్ పెట్టుకున్న నలుగురు కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, ఇద్దరిని సస్పెండ్ చేయడాన్ని తీవ్ర చర్యగా పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇన్ని దారుణాలు జరుగుతుంటే స్థానిక(గాజువాక) టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీను, ఎంపీ శ్రీభరత్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

కెమికల్‌లో మొదటి 10 ర్యాంకులు మనవే..



గొలగాని శశాంత్ 1వ ర్యాంక్ | షేక్ అబుల్ రజాక్ 2వ ర్యాంక్ | దొడ్డి యశ్వంత్ 3వ ర్యాంక్ | తాడి ప్రనూష్ 4వ ర్యాంక్ | తేజ శివరాజ్ 5వ ర్యాంక్



పవన్ స్వామి 6వ ర్యాంక్ | జయశ్రీ 7వ ర్యాంక్ | మాధవి శ్రీలేఖ 8వ ర్యాంక్ | నల్లసాయివర్షిణి 9వ ర్యాంక్ | బంతి ప్రణీత 10వ ర్యాంక్

మురళీనగర్: ఇంజినీరింగ్ సెట్(ఈసెల్) ఫలితాల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) విద్యార్థులు ఈ ఏడాది కూడా మొదటి పది ర్యాంకులు కైవసం చేసుకున్నారు. గొలగాని శశాంత్ (1), షేక్ అబుల్ రజాక్(2), దొడ్డి యశ్వంత్ (3), తాడి ప్రనూష్ (4), సన్నిబోయిన తేజ శివరాజ్(5), పొలమరశెట్టి పవన్ స్వామి(6), నాయుడు జయశ్రీ (7), అవధూతల మాధవి శ్రీలేఖ(8), మీసాల నల్లసాయివర్షిణి (9), బంతి ప్రణీత (10) ర్యాంకులు సాధించారు. 1 నుంచి 6 వరకు ర్యాంకులు బాలురు, 7–10 వరకు ర్యాంకుల అమ్మాయిలు సాధించారు. ఇందులో 5వ ర్యాంకు విద్యార్థి తేజ శివరాజ్ ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం, 9, 10 ర్యాంకులు విద్యార్థినులు నల్లసాయి వర్షిణి, బంతి ప్రణీత డిప్లమా పెట్రో కెమిల్ ఇంజినీరింగు విభాగం విద్యార్థులు కాగా మిగతా ర్యాంకులు పొందిన విద్యార్థులందరూ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు. తమ విద్యార్థులు మొదటి పది ర్యాంకుల సాధించడం గైస్‌కు గర్వకారణంగా భావిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆనందం వ్యక్తం చేశారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించకుంటే స్తంభింప చేస్తాం..

ఉక్కునగరం: తప్పుడు సస్పెన్షన్లు, షోకాస్ నోటీసులను 24 గంటల్లో ఉపసంహరించుకోకుంటే స్టీల్ ప్లాంట్‌ను స్తంభింపచేస్తామని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మే 13వ తేదీన బీఎఫ్ విభాగంలో మీటింగ్ హాజరయ్యారనే సాకుతో నలుగురు కార్మికులను సస్పెండ్ చేయడంతో పాటు ఏడుగురు కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. కార్మిక సమావేశాలకు హాజరుకాకుండా బెదిరించడానికే ఈ విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. ఈ ఉత్తర్వులు ఏ విధంగాను చెల్లవన్నారు. వేలాది మంది పనిచేసే పరిశ్రమలో కార్మికులను, కాంట్రాక్ట్ కార్మికులను బెదిరించి పనిచేయించుకోవాలని అనుకోవడం అవివేకమన్నారు. అందులోను ప్రభుత్వ రంగ సంస్థలో ఇది అసాధ్యమన్నారు. యాజమాన్యం వైఖరికి నిరసనగా ఈనెల 16 నుంచి 19 వరకు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. 16న ఉదయం బీసీ గేటు వద్ద, 17న ఉదయం మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 18న అన్ని నిర్వాసిత కాలనీల్లో ర్యాలీలు చేస్తామని తెలిపారు. 19న జాతీయ కార్మిక సంఘాల నాయకులతో సాయంత్రం 5.30కు మెయిన్ గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాఖ–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం విశాఖ–చర్లపల్లి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. చర్లపల్లి–విశాఖ(07441) స్పెషల్ ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకుబయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.35 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖ–చర్లపల్లి(07442) స్పెషల్ ఈ నెల 18వ తేదీన రాత్రి 11 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 11.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

నగ్నంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో మంగళవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో నగ్నంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎంవీపీ క్రైం పోలీసులు తెలిపిన వివరాలివి. బి.విశ్వసాయి ఎంవీపీ సెక్టార్–11లోని శ్రీ మారుతి నిలయంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతను కుటుంబ పని మీద వేరే ఊరు వెళ్లి, 14వ తేదీన తిరిగి వచ్చి చూడగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దీంతో సీసీ టీవీ ఫుటేజ్‌ని పరిశీలించగా 12వ తేదీ అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి నగ్నంగా తన ఇంట్లోకి చొరబడటాన్ని, దొంగతనానికి ప్రయత్నించడాన్ని గుర్తించాడు. ఇంటి ముందున్న ఓ సీసీ టీవీని ధ్వంసం చేసి ఉండడం, రూ.3,500 నగదు కనిపించకపోవడాన్ని గమనించాడు. దీంతో ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బుధవారం కేసు నమోదైంది. అనంతరం ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు ఈ దొంగతనానికి పాల్పడింది విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన పాత నేరస్తుడు వడ్డాది విజయ్ అలియాస్ పొట్టి విజయ్‌గా గుర్తించారు. అతన్ని గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా విజయ్ నగ్నంగా పలు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. దొంగతనం చేస్తూ దొరికిపోయినా.. మానసిక స్థితి బాగోలేని వ్యక్తిగా పరిగణిస్తారనే ఉద్దేశంతో ఇలా నగ్నంగా చోరీలు చేస్తాడని పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని కలాసీ మృతి

అక్కిరెడ్డిపాలెం: ఓ కలాసీ తలపై నుంచి ఫార్మా బస్సు వెళ్లిపోవడంతో దుర్మరణం చెందాడు. వేపగుంటకు చెందిన బొజ్జా రాంబాబు(40) కలాసీ. ఆటోనగర్ సర్వీస్ రోడ్డు సమీపంలోని బి–బ్లాక్ వద్ద గల వాహనాలు మరమ్మతులు చేసే ప్రాంతంలో రాత్రి సమయాల్లో నిద్రిస్తుంటాడు. గురువారం వేకువ జామున అక్కడే బల్లపై నిద్రిస్తున్న రాంబాబును గమనించని ఒక ఫార్మా కంపెనీకి చెందిన బస్సు డ్రైవర్ రివర్స్ చేస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సు రాంబాబు తలపై నుంచి వెళ్లడంతో.. ఘటనా స్థలంలోనే అతను మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

లారీని ఢీకొని ఆటోడ్రైవర్ దుర్మరణం



బంగారు రమణ(ఫైల్)

పీఎంపాలెం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కూరగాయలు రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ వెల్లడించిన వివరాలివి. ఆనందపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బంగారు రమణ(41) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజూ మాదిరిగానే గురువారం తెల్లవారుజామున ఆనందపురం కూరగాయల మార్కెట్ నుంచి కూరగాయలను తన ఆటోలో వేసుకుని నగరంలోని పెదవాల్తేరుకు బయలుదేరాడు. తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో ఎండాడ కూడలికి సమీపంలోని వరాహగిరి కాలనీ ఎదురుగా జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రమణ నడుపుతున్న ఆటో ముందు అతివేగంగా వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. ఊహించని ఈ పరిణామానికి రమణ తన ఆటోను అదుపు చేయలేక లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న నరసింగరావు అనే వ్యక్తి స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

తాటిచెట్లపాలెం: షాలిమర్ నుంచి నాగర్‌కోయల్ జంక్షన్ (12660) వెళ్తున్న గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌లో స్వల్ప పొగలు వ్యాపించాయి. గురువారం సాయంత్రం ఈ రైలు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అనంతరం ఇక్కడి నుంచి బయలుదేరే సమయంలో ఎస్–11 కోచ్‌లో చార్జింగ్ పాయింట్ వద్ద మొబైల్ ఫోన్ చార్జింగ్ సమయంలో చిన్నగా పొగలు వచ్చాయి. దీనిని గమనించిన ప్రయాణికులు చైన్ లాగారు. తర్వాత అందరూ రైలు నుంచి దిగిపోయారు. సమస్యను గుర్తించిన రైల్వే సిబ్బంది.. సరి చేసి వెంటనే రైలును పంపించారు.

జీవీఎంసీ ఆర్పీ ఆత్మహత్య

- భార్యాభర్తల మధ్య గొడవలే కారణమా?
- భర్త జనసేన కార్యకర్త

అల్లిపురం: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 34వ వార్డులో ఆర్పీగా పని చేస్తున్న సాయి(29), గండిబోయిన సతీష్ తొమ్మిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఆరేళ్ల బాబు ఉన్నాడు. సతీష్ పూర్ణామార్కెట్‌లో ఒక దుకాణంలో పని చేస్తున్నాడు. అతను జనసేన కార్యకర్త. వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో సాయికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఆ కాల్‌లో మాట్లాడిన ఆమె గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో విచారణ చేపడుతున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు

ఎండ.. వాన..





నగరంలో గురువారం విభిన్న వాతావరణం చోటుచేసుకుంది. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపించగా.. మరికొన్ని చోట్ల ఆకాశం దట్టమైన మేఘాలతో నిండి చిరుజల్లులు కురిశాయి. ఇంకొన్ని ప్రాంతాల్లో కేవలం మేఘాలు మాత్రమే ఆవరించి, వర్షం కురవకపోవడంతో నిరాశ ఎదురైంది. సాయంత్రం ఆర్.కె.బీచ్ వద్ద ఆకాశం మేఘావృతమవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దీంతో పర్యాటకులు సందడి చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలలు పోయి.. శిలలు!





సాధారణంగా అలలు ఎప్పుడూ ఒకే తీరుగా ఉండవు. ఆటుపోట్ల ప్రభావంతో కొన్ని సార్లు సముద్ర మట్టం గణనీయంగా తగ్గి, నీరు తీరం నుంచి కొంత దూరం వెనక్కి వెళ్తుంది. గురువారం ఆర్.కె.బీచ్ వద్ద అలాంటి పరిస్థితి ఎదురైంది. దీంతో రాళ్లు బయటపడ్డాయి. ఈ దృశ్యం పర్యాటకులను ఎంతగానో ఆకర్షించింది. ఈ రాళ్లపై నడుచుకుంటూ కొందరు సముద్ర అందాలను ఆస్వాదించారు. మరికొందరు సెల్ఫీలు తీసుకుంటూ.. ప్రకృతి అందాలను ఫోన్లు, కెమెరాల్లో బంధిస్తూ ఉత్సాహంగా గడిపారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం